నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | జనవరి 01, 2025 | www.navatelangana.com

జాగ్రత్తలు వహిస్తే వ్యాధులు దరిచేరవు

- పిహెచ్‌సీ వైద్యులు సురేష్

నవతెలంగాణ-రామారెడ్డి

పరిసరాల పరిశుభ్రతతో పాటు పలు జాగ్రత్తలను వహిస్తే వ్యాధులు దరిచేరవని రామారెడ్డి పిహెచ్‌సీ వైద్యులు సురేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీవీబీలో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. తినే పదార్థాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తాగే నీళ్లను కాచి వడబోసుకుని తాగాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జానకమ్మ, వైద్య సిబ్బంది శ్రీహరి, శ్రీధర్, కేజీవిబి సిబ్బంది రజిత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు వైద్య పరీక్షలు

గురుకుల ప్రవేశాలకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-భిక్కనూర్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ విద్యార్థులకు ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు నేటి నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆన్‌లైన్లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా చేసుకుని ప్రవేశాలు ఉంటాయని ఫిబ్రవరి 23 ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అన్ని గురుకుల పాఠశాలలో ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు http://tgswreis.Telangana.https://tgcet.cgg.gov.in ఈ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

- ఉత్సాహంగా 2025 నూతన సంవత్సరానికి స్వాగతం
- అర్ధరాత్రి వరకూ న్యూఇయర్ వేడుకలు
- తెల్లవారుజామువరకూ బందోబస్తులో పోలీసులు
- భారీగా కేక్, మాంసం విక్రయాలు
- పలు దుకాణాల వద్ద ప్రజల రద్దీ



కొత్త ఆశలతో

కాలం మన ఆహ్వానాలను అందుకుంటూ.. మన వీడ్కోలును స్వీకరిస్తూ ముందుకు సాగిపోతూనే ఉంది. 2024 వెళ్లిపోయి 2025 వచ్చింది. 2024 అనుభవాలు 2025లో మన ప్రణాళికలకు పునాదులు కానున్నవి. ఉద్వేగంతో 2024కు వీడ్కోలు పలికి ఉత్సాహంతో 2025కు ఆహ్వానం పలుకుతున్నాం. యువత డీజే ధ్వనుల మధ్య, బాణాసంచా ధూమ్ దాముల మధ్య కేరింతలతో స్వాగతం పలికితే.. అనుభవాలతో రాటు దేలిన వారు మందహాసంతోనే 2025 కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించారు. ఇద్దరి ఆకాంక్ష రానున్న కొత్త సంవత్సరంలో ఉజ్వలమైన భవిష్యత్తు ఉండాలనే. తమకు ఎంతో ఇష్టమైన బంధుమిత్రులతో అనుబంధాలు దృఢపడాలని, కొత్త స్నేహితులు కొత్త అనుబంధాలు జీవితాన్ని మరింత రసవంతంగా మార్చాలని కోరుకున్నారు. సామాజికంగా, ఆర్థికంగా కొత్త సంవత్సరంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వ్యక్తి సంతోషం కన్నా సమాజానికి హితం చేసే అద్భుతాలకు 2025 వేదిక కావాలని కోరుకున్నారు. తీపి చేదులను మిగిల్చిన 2024 సంవత్సరం 2025లో సానుకూల ఫలితాలను సాధించేందుకు కావలసిన శక్తినిచ్చిందనడంలో సందేహం లేదు. ఆ శక్తిని సాధికారికంగా ఉపయోగించుకుందాం. 2025ను మన జీవితంలో స్వర్ణపుటగా మార్చుకుందాం.

నవతెలంగాణ-కంఠేశ్వర్

2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025వ సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. ఒకవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మరోవైపు విందులు, వినోదాలను చేసుకున్నారు. ఆధ్యాత్మికంగా నడుచుకునేవారంతా దేవాలయాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయగా.. విందులు, వినోదాలు చేసేవారు వైన్స్, హెటళ్లు, రెస్టారెంట్లకు బారులుతీరారు. నిజామాబాద్‌లోని పలు చర్చిల్లో క్రైస్తవులు పెద్దఎత్తున చేరుకుని అర్ధరాత్రి ప్రార్థనలు చేశారు.

ఇదిలా ఉంటే విందులు, వినోదాల పేరిట ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి పోలీసు కమిషనర్ సింధు శర్మ ఇప్పటికే పలు సూచనలు చేశారు. నియమ, నిబంధనలను భేఖాతర్ చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. త్రిబుల్ డ్రైవింగ్, డీజె సౌండ్‌కు అనుమతి లేదని పోలీసులు ఇప్పటికే స్పష్టం చేశారు. విందు, వినోదం కార్యక్రమాలకు నగరవాసులు పెద్దపీట వేశారు. ఇందులో భాగంగానే నగరంలోని హెట ళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, వైన్స్ బిజీబిజీగా మారాయి. వినియోగదారులను ఆకర్షించడానికి విద్యుత్ వెలుగులతో ఏర్పాట్లు చేశారు. వ్యాపార సముదాయాలు, వైన్‌షాపులు కిక్కిరిసిపోయాయి. మందు పార్టీలకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో వైన్ అమ్మకాలు భారీగా పెరిగాయి. ఇదిలావుంటే బేకరీలు కేక్ బాక్స్‌లతో నిండిపోయాయి. పెద్దసంఖ్యలో వినియోగదారులు నూతన సంవత్సరం కేక్ కట్టింగ్‌కు ప్రాధాన్యతనిచ్చారు.


ప్రార్థనలకు ముస్తాబైన జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చ్



పోలీసుల తనిఖీలు..

నిబంధనలను పాటిస్తూ నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని నిజామాబాద్ ఇన్చార్జ్ పోలీసు కమిషనర్ సింధుశర్మ ప్రజలకు సూచించారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ రానున్న 2025 సంవత్సరానికి ఆనందంగా స్వాగతం పలికే వేళ ప్రజలు జాగ్రత్తలు, నియమ, నిబంధ నలు పాటించాలని కోరారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి 9గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 3గంటల వరకు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ఎక్కడికక్కడ తనిఖీలు చేశారు. నగరాల్లో సుమారుగా ప్రధాన కూడళ్లతో పాటు సుమారు 30కి పైగా వాహన తనిఖీ పాయింట్లను ఏర్పాటు చేశారు.

చర్చిలలో అర్ధరాత్రి ప్రార్థనలు..

నిజామాబాద్ నగరంలోని పలు ప్రసిద్ధమైన చర్చిలలో అర్ధరాత్రి ప్రార్థనలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 2024కు వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరం 2025కు స్వాగతం పలుకుతూ ప్రార్థనా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ నగరంలోని సిఎస్ఐ చర్చిలలో అర్ధరాత్రి ప్రార్థనలు పెద్దఎత్తున నిర్వహించారు.

నూతన సంవత్సర స్వాగత వేడుకలు

నవతెలంగాణ-బోధన్

నూతన సంవత్సర స్వాగత వేడుకలు నిర్వహించేందుకు గానూ యువత మంగళవారం రాత్రి నుంచే సిద్ధమయ్యారు. నూతన సంవత్సరం వేడుకల కోసం బేకరీలలో సరికొత్త వెరైటీలలో కేకులు వచ్చాయి. కేక్‌లపై ప్రత్యేక ఆఫర్‌లు ప్రకటించి వినియోగదారులను ఆకట్టుకునేలా దుకాణాలను ముస్తాబు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా బోధన్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బేకరీ, హెూటల్ నిర్వాహకులు కేక్‌లపై ప్రత్యేక ఆఫర్‌లను ప్రకటించారు. అరకిలో కేక్ రూ.100, కిలో కేక్ రూ.200లకు కొనుగోలు చేస్తే కేక్‌తో పాటు కూల్ డ్రింక్ ఉచితంగా అందించారు. బోధన్ పట్టణంలోని స్ప్రింగ్ బేకరీలో నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా తందూరీ చికెన్ రూ.300లకే విక్రయిస్తున్నట్లు బేకరీ యజమాని అఫ్రోజ్ తెలిపారు.



పట్టణంలోని స్ప్రింగ్ బేకర్స్..

పోలీసుల ఆంక్షలు..

నూతన సంవత్సరం వేళ అనైతిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మద్యం సేవించి విచ్చలవిడిగా వాహనాలను నడపరాదని పోలీసులు హెచ్చరించారు.

జోరుగా కేకులు, మాంసం విక్రయాలు

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ పట్టణంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేసులు, మాంసం విక్రయాలు జోరుగా కొనసాగాయి. కేకులకు భారీ గిరాకీ ఉండటంతో పట్టణ ప్రాంతంలో ఆఫర్లు ప్రకటిస్తూ తక్కువ ధరకే అందజేశారు విక్రయదారులు. మాంసం విక్రయాల ఎదుట బారులు తీరారు. గత ఏడాది కంటే ఈసారి విక్రయాలు అధికంగా ఉన్నాయని, అర్ధరాత్రి వరకూ గిరాకీ ఉందని వ్యాపారస్తులు తెలిపారు.



స్కావెంజర్ వేతనంలో కోత

- వేతనం రూ.8000 కాగా.. ఏడాది నుంచి 3200 మాత్రమే చెల్లింపు
- పొంతనలేని సమాధానం చెబుతున్న ప్రధానోపాధ్యాయుడు

నవతెలంగాణ-వర్ని

ప్రభుత్వ పాఠశాలలో అటెండర్లు లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో పాఠశాలకు స్కావెంజర్లను నియమించారు. వీరికి ప్రతి నెల విద్యార్థుల సంఖ్యను బట్టి వేతనాలు చెల్లిస్తోంది ప్రభుత్వం. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి మూడు నెలల జీతాన్ని నవంబర్ చివరలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పేరుపై జమ చేసింది. మహిళా అధ్యక్షులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిసి జాయింట్ ఖాతా ఉంటుంది. అందులో నుంచి స్కావెంజర్లకు వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది.

బాలికల పాఠశాలలో స్కావెంజర్ జీతం ఎంఈఓ వద్దనే..

వర్ని ఉమ్మడి మండలంలో సుమారు 94 పాఠశాలలో స్కావెంజర్లు పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వం జీతాలు సమయానికి ఇవ్వకుంటే పాఠశాల ఉపాధ్యాయులు తలా కొంత జమ చేసి చెల్లిస్తారు. ప్రభుత్వం ఫండ్ వచ్చిన తర్వాత తీసుకొంటారు. ఇలా కొన్ని నెలలు కొనసాగినా.. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గుర్తించి అమ్మ ఆదర్శ కమిటీ ఏర్పాటు చేసి వారిని నియమించేలా జీతాలు ఇచ్చేలా చూడాల్సిన బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీ, ప్రధానోపాధ్యాయులకు అప్పగించింది. అందులో విద్యార్థుల సంఖ్యను బట్టి జీతాలు ఇవ్వాలని ఆదేశాలున్నాయి. అందుకు వారికి మూడు నెలల నవంబర్ చివరిలో ప్రభుత్వం జీతాలు ఖాతాలో జమ అయ్యాయి. వీటిని కొన్ని పాఠశాలల్లో పాఠశాల జనరల్ పనుల కోసం వాడుకొని స్కావెంజర్లకు కోత కోస్తున్నారని ఆరోపణలున్నాయి. అందుకు నిదర్శనం మండల కేంద్రంలోని ఎస్ఎన్‌పురం గ్రామ బాలికల పాఠశాలనే. ఆ పాఠశాలలో రేణుక అనే మహిళా స్కావెంజర్‌గా పని చేస్తోంది. ఏడాది నుంచి పనిచేస్తున్న ఆమెకు నెలకు రూ.3200 వేతనం అందజేస్తున్నారు. కానీ ఈ పాఠశాలలో ఉన్న విద్యార్థులు 180 మంది. వాస్తవానికి ఆమెకు నెలకు రూ.8 వేలు వేతనం ఇవ్వాలి. అది కాకుండా నేడు, రేపు అంటూ జీతం పెరగలేదని హెచ్‌ఎం కాలం వెళ్లదీస్తున్నారని, తనకు ఇవ్వాల్సిన జీతంలో కోతకోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా, ఎంఈఓ ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఈ పాఠశాలలో 184 మంది విద్యార్థినీలు ఉన్నారు. ప్రభుత్వం లెక్కల ప్రకారం రూ.8000 స్కావెంజర్‌కు ఇవ్వాలి. కానీ ఎంఈవో మాత్రం ఆమెకు రూ.3100 మాత్రమే ఇస్తూ తన జీతంలో కోతలు పెడ్తుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అలా ఎందుకని బాధితురాలు ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ప్రభుత్వం పాఠశాలల్లో బాత్‌రూమ్‌లు, ప్రాంగణం శుభ్రంగా ఉంచడం.. చెట్లకు నీరందించడం కోసం స్కావెంజర్లను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా నియమించింది. వారికి విద్యార్థుల సంఖ్యను బట్టి జీతాలు చెల్లిస్తుంది. పాఠశాల మెరుగుపడాలని ప్రభుత్వం చూస్తుంటే.. స్కావెంజర్ల పేదరికాన్ని అడ్డుపెట్టుకుని 'ప్రభుత్వం ఇవ్వనప్పుడు నేను ఇస్తున్నా.'ను అని ఎంఈఓ స్కావెంజర్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రేణుక ఆరోపిస్తోంది. తాను ఉదయం నుంచి సాయంత్రం 6 వరకు పనిచేస్తున్నానని, జీతాలు పెరిగినా, పెంచిన డబ్బులు సార్ ఇవ్వటం లేదని ఆమె నవతెలంగాణతో తెలిపారు.



ఎవరికి చెప్పుకోవాలి

నేను ఎస్ఎన్‌పురం గ్రామంలోని బాలికల పాఠశాలలో గత ఏడాది నుంచి స్కావెంజర్‌గా పనిచేస్తున్నాను. నాకు రావాల్సిన జీతం రూ.8000 ఉంటే ప్రధానోపాధ్యాయులు రూ.3200లే చెల్లిస్తూ మిగతా డబ్బులు కట్ చేస్తున్నారు. ఇలా చేస్తే నేను ఎవరికి చెప్పుకోవాలి. - స్కావెంజర్, రేణుక.

పదివేలు బాకీ ఉంది

స్కావెంజర్లకు అన్ని పాఠశాలల్లో జీతాలు మూడు నెలలవి ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలో జమ చేసింది. రేణుక అనే స్కావెంజర్‌కు ఒకే నెల జీతం ఇవ్వాలి. ఆమె డ్యూటీకి డిసెంబర్‌లో రాలేదు. మిగతా నెలలో వచ్చింది. ఆ జీతం ఇచ్చాను. స్కావెంజర్ నాకు పది వేలు బాకీ ఉంది. - ఎంఈవో సాయన్న

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- సెక్టార్ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వం సరఫరా చేస్తున్నా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటిస్తూ, చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యా బోధనను అందించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య అన్నారు. మంగళవారం సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిన్నారుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రతిరోజు చిన్నారులకు గుడ్డు అందించాలని అలాగే గర్భిణి బాలింత మహిళ విషయంలో ప్రత్యేక దష్టి సారించాలని ఆమె సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన ఆకుకూరలను ఎక్కువగా తీసుకునేలా గర్భిణీ బాలింత మహిళలకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. చిన్నారుల ఎత్తు బరువులను కొలిచి వారికి పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సౌజన్య

విద్యార్థుల ఉన్నతికి పాటుపడండి

- సబ్ కలెక్టర్ వికాస్ మహతో
- క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బోధన్ టౌన్

విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో స్టేట్ టీచర్స్ యూనియన్ బోధన్ మండల శాఖ క్యాలెండర్‌ను సబ్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సంద్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, సమాజంలో మనం ఏ స్థానంలో ఉన్న దానికి కారణం ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన్ అర్బన్ అధ్యక్షులు సలీం, ప్రధానకార్యదర్శి కిషోర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాలచంద్రం, సుధాకరరెడ్డి, వహెద్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో గల 12వ వార్డులో జాతీయ ఉపాధి హామీ నిధులతో మంజూరైన రూ.20లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలోని పన్నెండవ వార్డులో రోడ్డు సరిగా లేవని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, సకాలంలో స్పందించిన ఎమ్మెల్యే సీసీ రోడ్డు మంజూరు చేయించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయకుమార్ గౌడ్, జక్కం బాలింగం, రాధా కిషన్ గౌడ్, చిక్కల లక్ష్మణ్, జయవర్ధన్ గౌడ్, ఏంబా మోహన్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్, బిల్ కలెక్టర్ భూమన్న పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు
- కుస్తీ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

క్రీడలు మానసికొల్లాసానికి, శరీర ధారుడ్యానికి, ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలో ఖండుబా జాతర, ఎల్లా అమావాస్య పండుగ పురస్కరించుకొని ఎమ్మెల్యే కుస్తీ పోటీలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారిలో నైపుణ్యాలను పెంపొందించడానికి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ స్కూల్స్ ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. వచ్చే ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటి దేశానికి పతకాలు తెచ్చి పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌లను ప్రత్యేకంగా అభినందించడమే గాక వారికి ప్రోత్సాహకాలు అందించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సహించేందుకు ఎల్లవేళలా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుస్తీ పోటీల సందర్భంగా గ్రామంలో జాతర ఏర్పాటు చేయగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కుస్తీ పోటీలకు తిలకించేందుకు మూడు రాష్ట్రాల ప్రజలు రావడంతో జాతరంతా కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే ప్రజల మధ్య కూర్చొని పోటీలను ఆసక్తిగా తిలకించారు. మండలంలోని అత్తాపూర్ గ్రామవాసి గంగాధర్ గెలుపొందడంతో వారికి మొదటి బహుమతిగా రూ.5,501 ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో పెద్దఎడ్గి గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

వృద్ధ మహిళ అంత్యక్రియలకు సహాయం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని పాత పోతంగల్ గ్రామంలో విఠోబా మందిరంలో భగవత్ మహారాజ్ భార్య చనిపోవడంతో వారి కుమారుడు శ్యాం మహరాజు తల్లి అంత్యక్రియల నిమిత్తం వైశ్య సంఘం సభ్యులు రూ.11 వేలు, బ్రాహ్మణ సమాజం తరఫున రూ.10 వేలు, గంధపు(గిర్నిల) రాజు రూ.5వేలు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సహాయం చేశారు.



పౌరహక్కులపై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్/నాగిరెడ్డిపేట్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య మాట్లాడుతూ ప్రతి నెల చివరి తేదీ నాడు నిర్వహించే సివిల్ రైట్స్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులందరూ కులాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని, కులంతో దూషించకుండా సమానత్వం అనే భావనతో ఒకరికొకరు సహకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీష్, పంచాయతీ కార్యదర్శి బాబు, అంబేద్కర్ సంఘం సభ్యులు, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండలంలోని గోలిలింగాల్ గ్రామంలో మంగళవారం ఆర్ఐ మొహమ్మద్ పౌరహక్కులపై గ్రామ స్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంటరానితనం పాటించకూడదని పలు సలహాలు సూచనలు చేశారు.


గోలిలింగాల్ గ్రామంలో..

మేకల మందపై కుక్కల దాడి

నవతెలంగాణ-భిక్కనూర్

మేకల మందపై కుక్కలు దాడి చేయగా 25 మేకలు మతి చెందిన ఘటన పట్టణ కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. భిక్కనూర్ నుంచి కాచాపూర్ మార్గంలో బీరయ్య మేకల మందపై వారం రోజుల క్రితం కుక్కల దాడిలో 28 మేకలు మతిచెందగా మంగళవారం తెల్లవారుజామున మరో 25 మేకలు మతి చెందాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని మతిచెందిన మేకలకు నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు.



పోచారం నీటి విడుదల వాయిదా

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

జనవరి ఒకటో తేదీన విడుదల చేయనున్న పోచారం ప్రాజెక్టు నీటి విడుదల వాయిదా పడినట్లు ప్రాజెక్టు డిఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. తదుపరి నీటి విడుదల తేదీ 3 లేదా 4వ తేదీ ఉంటుందని ఆయన తెలిపారు. నీటి విడుదల తేదీని రెండు రోజుల్లో తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

నిబంధనలను పాటించండి

- జుక్కల్ ఎస్సై భువనేశ్వర్

నవతెలంగాణ-జుక్కల్

ప్రజలు నిబంధనలను పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఎస్సై భువనేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని పేర్కొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ నియోజకవర్గ ప్రజలకు మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు మంగళవారం తెలిపారు. 2025వ సంవత్సరంలో ప్రతి ఇంటా ప్రజలు ఆయురారోగ్యాలతో, పిల్ల పాపలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

వరి సాగును పరిశీలించిన వ్యవసాయ అధికారులు



నవతెలంగాణ-నవీపేట్
మండల కేంద్రంలోని బట్టోడ్ బాగ్ శివారులో వరి విత్తనోత్పత్తిలో భాగంగా రైతు సాయిలు నూతనంగా అనుసరిస్తున్న సాగు పద్ధతిని మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ మంగళవారం పరిశీలించారు. వరి సాగులో నాట్ల సమయంలో చేపట్టవలసిన చర్యల గురించి రైతులకు వ్యవసాయ అధికారులు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏఈఓలు వినోద్, వసంత్, రైతులు ఉన్నారు.

స్మైల్ పాఠశాలలో న్యూ ఇయర్ వేడుకలు



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని స్మైల్ స్కూల్‌లో మంగళవారం న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, స్టాఫ్ డ్రెస్ కోడ్‌తో వచ్చి కేక్ కట్ చేసి న్యూ ఇయర్‌కి స్వాగతం పలికారు. చిన్నారులందరూ గేమ్స్ ఆక్టివిటీస్ అండ్ కల్చరల్ ప్రోగ్రామ్స్‌తో బిజీబిజీగా గడిపారు కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రిన్సిపల్ షబానా గౌహర్, డైరెక్టర్ గౌహర్, స్టాఫ్ సింధూర, సవిత, స్వప్న, సింధుజ, సరిత, ప్రసన్న, శ్రావణి, రోజా, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

కాలం మారుతుంది.. మనం మారుదాం

- కొత్త ఏడాది.. కొత్త ప్రణాళిక..
- 2025లో కొత్త పనులకు శ్రీకారం చుడదాం

నవతెలంగాణ-ఆర్మూర్
కాలం మారుతుంది. దాంతో పాటు మనము మారాల్సిందే కొత్త సంవత్సరంలోనైనా కాస్త ప్రణాళిక బద్ధంగా జీవిద్దాం. బిజీ లైఫ్ వేళా పాల లేని ఆహారపు అలవాట్లతో గతంలో కన్నా శరీర బరువు పెరిగింది. ఎప్పటినుంచో వాకింగ్‌కు, జిమ్ముకు వెళ్లాలనే ఆలోచన. రేపటి నుంచి క్రమం తప్పకుండా వెళ్లాలని నిర్ణయిం చుకోవడం, తర్వాత ఏవో కారణాలతో వాయిదా పడడం ఇదొక్క టే కాదు చాలా అలవాట్లకు స్వస్తి పలకడం, మంచి నిర్ణయాలు తీసుకోవడం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం ఇలా బోలెడన్ని అనుకున్న ఆచరణలో మాత్రం తగ్గిపోతుంటాయి. ...కానీ 2025 అలా కాకూడదని తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని గట్టిగా నిర్ణయించుకుందాం. ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే ముందు కానీ సాధ్యసాధ్యాలను ఆలోచించాలి. మనతో అవుతుందనుకుంటే పాటించాలి. కొంచెం కష్టమైనా పరవాలేదు అనుకుంటే ట్రై చేయాలి .కానీ సాధ్యం కాని దాన్ని ఎన్నుకొని తర్వాత మధ్యలోనే వదిలిపెట్టడం మంచిది కాదంటున్నారు వ్యక్తిత్వ నిపుణులు. కష్టతరమైన క్రమం తప్పకుండా చేస్తే అదే అలవాటుగా మారుతుంది అనేది వారి అభిప్రాయం. ఇక ఇప్పటికైనా క్రమం తప్పకుండా పాటించాల్సినవి కొన్ని ఉన్నవి..

దూరలవాట్లకు స్వస్తి...
మనిషిని చెడు ఆకర్షించినంత వేగంగా మంచి ఆకర్షించదు. కాబట్టి దురలవాట్లకు దూరంగా ఉండాలి. ఒక్కసారి కదా అని పొరపాటున కూడా వాటి జోలికి వెళ్లకూడదు. దురల వాట్లకు ఒకసారి దగ్గర అయితే వాటి నుంచి బయటపడడం తేలిక కాదు. కాబట్టి కొత్త ఏడాదిలో వాటి జోలికి వెళ్లనని నిర్ణయించుకోవాలి. మనసును అదుపులో ఉంచుకుంటే అదేమి అసాధ్యం కాదు .ఇవన్నీ పాటిస్తే మీదిక విజయమే.



సమయపాలన...
మనలో బోలెడంత నైపుణ్యం ఉండొచ్చు. చేయి తిరిగిన వ్యాపారి ఉండొచ్చు కానీ సమయపాలన లేకపోతే ఆయా రంగాలలో రాణించటం కష్టం.. సమయం ఎంత ముఖ్యమో మిగతా వారికి అంతే అన్న సంగతి మర్చిపోకూడదు. పనులను వాయిదా వేసే విధానాన్ని వెంటనే విడనాడాలి సమయాన్ని ఎంత బాగా ఉపయోగించుకుంటే అంత మేలు.

సానుకూల దృక్పథం...
చిన్నపాటి సమస్యలకే కృంగిపోవడం మంచి లక్షణం కాదు.. సమస్య వచ్చినప్పుడు సానుకూల దృక్పథంతో ఆలోచించాలి ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందన్న సంగతి మర్చిపోకూడదు. కష్టాలు ఎదురైనప్పుడు కృంగిపోకుండా మార్గాలు అన్వేషించాలి. ఆత్మీయులతో చర్చిస్తే పరిష్కారం సులభంగా దొరకవచ్చు. సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే విజయం కళ్ళ ముందు కనబడుతుంది.

ఒత్తిడిని జయించాలి...
వేగం సంతరించుకున్న జీవితాలలో ఒత్తిడి ఒక భాగమైపో యింది. ఇక అంతే ఒత్తిడిని ఎదుర్కొనే వ్యూహాలు రచించాలి. దానిపై చేయి సాధిస్తే విజయం సొంతమవుతుంది. ఇది చెప్పి నంత సులభం కాకపోయినా సంకల్ప బలం ఉటే పెద్ద కష్టమే మి కాదు. మంచి వారితో స్నేహం చేయడం నలుగురిలో కలిసిపోవడం, పుస్తక పఠనం, యోగ ఇలాంటి వాటితో ఒత్తిడిని తరిమికొట్టవచ్చు.

నిరంతర విద్యార్థిగా...
ప్రపంచం వేగంగా మారిపోతుంది ఆ వేగాన్ని అందుకునే ప్రయత్నం చేయాలి. కంప్యూటర్‌తో పోటీ పడాలి. నేర్చుకునే ధోరణి పెరగాలి. ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలి. సమయం లేదని వీలు కాలేదని సాకులను కట్టిపెట్టాలి. విషయాలు తెలుసుకోవడంలో నిరంతర విద్యార్థిగా ఉంటేనే సక్సెస్ సొంతమవుతుంది.

ఆరోగ్యమే మహాభాగ్యం...
ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదు. ఇప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాంగా.... సమస్య వచ్చినప్పుడు చూద్దాం అని చాలామంది ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. ఆ తర్వాత సమస్య వచ్చినప్పుడు బెంబేలెత్తి పోతుంటారు. దీనిని తప్పించుకునేందుకు రోజుకో అరగంట వ్యాయామం చేయాలి. మరి ఆలస్యం ఎందుకు.. ఈరోజు నుంచే ప్రారంభించేద్దాం. కొత్త ఏడాదిలో అలవాటుగా మార్చుకుందాం.

పొదుపు...
వచ్చింది ఖర్చులకి సరిపోవడం లేదు .ఇక పొదుపా అని చాలామంది కొట్టి పారేస్తుంటారు జీతం వచ్చిందా.. ఖర్చు చేసామా ఇది కొందరి ధోరణి. కానీ అవసరాలు చెప్పి రావు కాబ ట్టి నెలకు కొంతైనా పొదుపు కోసం తీసేసి మిగతా సొమ్మును ఖర్చులకోసం వాడుకోవాలి. పొదుపు ఏ రకంగా ఉండాలో మొదటి నిర్ణయం తీసుకోవాలి వచ్చిన జీతంలో వీలైనంతగా పొదుపు కోసం కేటాయిస్తే భవిష్యత్తు బంగారుమయమే.

సాయంతో తృప్తి...
ప్రపంచీకరణ జీవన విధానంలో వేగం పెరిగింది. అపార్ట్మెంట్ల సంస్కృతి వచ్చాక ఎవరికి వారే అన్న ధోరణి పెరిగిపోయింది. సంవత్సరాల తరబడి ఒకే దగ్గర ఉంటున్న పక్కింటి వారి పేర్లు కూడా తెలియని స్థితి. మనకెందుకులే అన్న ధోరణి. మొదట దీనిని విడనాడాలి. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి. బాధలో ఉన్నవారికి బాసటగా నిలవాలి. చేతనైనంత సాయం చేయాలి. సేవలో దొరికే తృప్తి మరందులోనూ ఉండదు.

ఆరోగ్యం విషయంలో దృష్టిసారించాలి...



ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ తమ పనుల్లో భాగంగా ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు. నేటి యువత మద్యం, డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొత్త సంవత్సరంలోనైనా వీటికి దూరంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలతో ఉన్నతంగా ఎదిగేలా ముందుకు సాగాలి.
– వెంకట్ గౌడ్, వైద్యులు, రిషిత్ హాస్పిటల్, ఆర్మూర్.

కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలి



నూతన వసంతంలోకి కొత్త ఆలోచనలతో జీవితాన్ని ప్రారంభించాలి. పోయిన ఏడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. భవిష్యత్తులో మంచి స్థాయిలో రాణించాలంటే తమను తాము కొత్తగా తీర్చిదిద్దుకుంటూ ముందుకు సాగాలి.
–డాక్టర్ అమృత లత, ప్రముఖ రచయిత్రి,, విజయ్ విద్యాసంస్థల అభినేత్రి, ఆర్మూర్.

టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా డి.సత్యానంద్



నవతెలంగాణ-కంఠేశ్వర్
తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా వాసి డి. సత్యానంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ. రమేష్, జి.గంగాధర్ మంగళవారం తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28,29, 30 న టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలు మూడు రోజులపాటు జరిగాయన్నారు. విద్యారంగ పరిణామాలు, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్చలు చేశారని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం చేయాల్సిన కర్తవ్యాలను గుర్తించి పలు తీర్మానాలు చేశారు. అనంతరం రానున్న రెండు సంవత్సరాల కోసం రాష్ట్ర కమిటీని రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్స్‌లో జిల్లావాసి డి.సత్యానంద్ ని ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల జిల్లా కమిటీ హర్షం చేస్తుందన్నారు.

వసంత లక్ష్మి ఇందూర్‌కు గర్వకారణం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



వసంత లక్ష్మిని సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకున్న యోగ మాస్టర్ వసంత లక్ష్మిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు వసంతలక్ష్మీ గతంలో నోబుల్ వరల్డ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించి మొక్కవోని దీక్షతో గిన్నిస్ బుక్ రికార్డ్ లక్ష్యంగా ముందుకుసాగిందన్నారు. సమాకోనాసనంలో గత రికార్డును అధిగమించి ఏకధాటిగా 3 గంటల 48 నిముషాలు ఆసనం వేసి కొత్త రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం దక్కించుకోవడం ఇందూర్ బిడ్డగా అందరికి గర్వకారణం అన్నారు. ఇందూర్ జిల్లా అంటేనే యోగ, క్రీడాలు, సంస్కృతి కళలకు పెట్టిన పేరని అన్నారు, నేటి యువతరం విద్యతో పాటు మానసిక, శారీరక ఉల్లాసం కోసం యోగ, క్రీడలు వంటి వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. వసంత లక్ష్మిని గిన్నిస్ బుక్ రికార్డులో నిలబెట్టిన యోగ గురువు రాంచందర్ ని ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో సుభాష్ , రవలి,సుమలత, శివరాజ్, హేమదర్, తదితరులు పాల్గొన్నారు.

తాగి నడిపిన ఐదుగురికి జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్
నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాగి నడిపిన ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సిఐ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 31 మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రసాద్ కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. నూర్జాన్ 14 మందికి 21వేలు జరిమానా విధించి నరసింహారెడ్డి, నివాసం వినాయక్ నగర్, జైపాల్-సీతారామ నగర్ కాలనీకి చెందిన ఇద్దరికి రెండు రోజులు జైలు శిక్ష విధించారని సిఐ తెలిపారు. నాగారంకు చెందిన కే అభిషేక్, జి పోశెట్టి కుర్నాపల్లి, ఎస్కెఆఫ్ రోజ్ -అస్మి కాలనీకి చెందిన వ్యక్తులకు ఒక్కొక్క రోజు జైలు శిక్ష విధించినట్టు చెప్పారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-మోపాల్
మండల కేంద్రానికి చెందిన మునిపల్లి సాయిలు (40) మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆయనపై కేసు నమోదుచేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు. ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నూర్జహాన్ బేగం రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

విద్యుత్ ప్రయివేటీకరణను నిలిపేయాలి

- విద్యుత్ ఉద్యోగుల ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు మంగళవారం భారతదేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగుల మధ్యాహ్న సమయంలో 12 నుండి ఒంటి గంట వరకు పని నిలిపి ధర్నా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నం చేయడాన్ని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని ఉద్యోగ సంఘాలు కలిసి ధర్నా నిర్వహించారు. వెంటనే ప్రైవేటీకరణ నిలిపివేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమ సంఘాలు,,, నిజామాబాద్‌లో పవర్ హౌస్‌లో జేఏసీ రాష్ట్ర నాయకులు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో నోయిడా ఢిల్లీలో, బొంబాయిలో ప్రయివేటైజేషన్ వల్ల గతంలో వినియోగదారులకు సరైన సేవలు అందించక ప్రైవేటీకరణ నిలిచిపోయిందని తెలిపారు. గతంలో ఉత్తరప్రదేశ్లో ప్రైవేటీకరణ చేస్తామని పిలుపునివ్వగా దానికి భారత దేశవ్యాప్తంగా నిరసన వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టడంతో ప్రైవేటీకరణ కార్యక్రమం నిలిచిపోయిందని అన్నారు. దీంతో ఉద్యోగస్తులకే కాదు ప్రజలకు కూడా చాలా నష్టం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దీంతో వరిపంట దేశంలోని అందరికంటే అత్యధికంగా పండించినట్టు చెప్పారు. సబ్సిడీ రేట్లపై గృహ వినియోగదారులకు అందిస్తున్న విద్యుత్తు సబ్సిడీ పోతుంది కాబట్టి ప్రజలకు తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. అందువల్ల ఈ ప్రైవేటీకరణని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రవేటికరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. వెంటనే ఉత్తరప్రదేశ్ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లోని డిస్కొంట్ల ప్రైవేటీకరణను నిలిపివేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేందర్ గౌడ్, పూదరి గంగాధర్, సురేష్, గంగారాం నాయక్, తోట రాజశేఖర్, కాశీనాథ్, చంద్రశేఖర్, చెన్నయ్య, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, సునీత, మధమతి, నిజాముద్దీన్, సతీష్, 200 మంది విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న విద్యుత్ ఉద్యోగులు

పీజీఎల్‌ఎల్‌బి ఐదవ సెమిస్టర్ టైం టేబుల్ పొడిగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ ఎల్‌ఎల్‌బి ఐదవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష తేదీని పొడిగించారు. డిసెంబర్ 27న జరగవలసిన పరీక్షలను జనవరి 20 కు పొడిగించినట్టు తెలంగాణా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పీజీ ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్ పరిక్షల ఫీ తేదీ పొడగింపు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ- ఒకటవ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ (థియరీ మరియు ప్రాక్టికల్) పరీక్షలు ఎంఏ, ఎంఎస్ డబ్ల్యూ, ఎంకాం, .ఎంబీఏ, ఎంసీఏ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్ (ఏపీఈ పిసిహెచ్, ఐఎంబిఏ) (మొదటి సెమిస్టర్ ఎల్ ఎల్ బి) ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్(ఐఎంబిఏ) ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ పరీక్షల ఫీ తేదీలను ప్రకటించారు. పీజీ మొదటి సెమిస్టర్ (ఎంఏ, ఎమ్మెస్ డబ్ల్యూ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్(ఏపీ ఈ అన్ని సబ్జెక్టుల కలిపి పరీక్ష ఫీ 500, ప్రాసెసింగ్ ఫీ 200, ఎల్‌ఎల్‌బి, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్(పి సి హెచ్) అన్ని సబ్జెక్టులు కలిపి 600, ప్రాసెసింగ్ ఫీ 200 ఎంబీఏ, ఐఎంబిఏ, ఎంసీఏ, అన్ని సబ్జెక్టులు కలిపి 800 రూపాయలు, ప్రాసెసింగ్ ఫీ 200రూపాయలు. పీజీ - మూడవ, ఐఎంబిఏ, ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్స్ (ఎంఏ, ఎమ్మెస్ డబ్ల్యూ ఎంకాం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్(ఏపీఈ)అన్ని సబ్జెక్టులు కలిపి 500రూపాయలు. ఐఎంబిఏ, అన్ని సబ్జెక్టులు కలిపి 800 రూపాయలు ఉటుందని తెలిపారు. డిసెంబర్ 30 ఉండగా పొడిగిస్తూ ఈ పరీక ల ఫీ అపరాధ రుసుము లేకుండా 04-01-2025 వరకు 100 రూపాయల అపరాధ రుసుంతో తేదీ 08-01-2025 చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని కంట్రోలర్ తెలిపారు.

ఆలూరులో కళాశాల నిర్మాణానికి స్థల పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్
ఆలూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించబోతున్న జూనియర్ కళాశాల కోసం మంగళవారం డిఐఈఓ రవికుమార్ మంగళవారం స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గిరీష్, విజయ్ మాట్లాడుతూ.. జూనియర్ కళాశాల మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలూరు ఎంఈఓ నరేందర్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి రవికుమార్, బాల్కొండ ప్రిన్సిపాల్ రాజీవుద్దిన్, రాజేష్ ఆలూరు విడిసి అధ్యక్షులు బార్ల ముత్యం, నాడీశరం మల్లయ్య, ఉదయ్, హరీష్, డాక్టర్ అరుణ్, అనిల్, సంజీవ్, భాస్కర్, గంగారెడ్డి, మల్లేష్, జాన్ బంజ తదితరులు పాల్గొన్నారు.

విజయ హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్
జిల్లాలోని అమాయక పేదలను చికిత్స పేరుతో నిలువు దోపిడీ చేస్తున్న విజయ హాస్పిటల్ యాజమాన్యంపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని మంగళవారం నవీపేట్ మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన యువకులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 30న నాళేశ్వర్ గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ నగరంలోని విజయ హాస్పిటల్ లోని న్యూరో స్పెషలిస్ట్ డా. విష్ణు వర్ధన్ వద్దకు చికిత్స కోసం వెళ్లిందన్నారు. అక్కడ ఉన్న రిసెప్షనిస్ట్ డాక్టర్ అందుబాటులో లేకున్నా రూ.400ఫీజు తీసుకుని ప్రిస్క్రిప్షన్ రాసిచ్చారని తెలిపారు. ఎంఐఆర్‌తో సహా సుమారు 6టెస్టులు రాసిచ్చిందని అన్నారు. డాక్టర్ పరీక్షించకుండానే ఆరుటెస్టులు ఎలా చేయించుకోవాలని అడిగినందుకు పేషెంట్‌ను బూతు మాటలు తిడుతూ అక్కడి నుంచి గెంటేశారని తెలిపారు. పేషెంట్ నడవలేని స్థితిలో ఉన్నా గెంటేశారని అన్నారు.



పేషెంట్‌ను పరీక్షించకుండానే టెస్టులు రాయడం, అధికంగా మందులు రాయడం, పేద మధ్యతరగతి వారి నుంచి డబ్బులు గుంజడమే లక్ష్యంగా లక్షలు గడిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై అడిగినందుకు సిబ్బందితో దాడులు చేస్తున్నారని తెలిపారు. ఆర్ఎంపీ డాక్టర్లను మచ్చిక చేసుకుని కమీషన్ల పేరుతో పేషెంట్ ను నిండా ముంచుతున్నారని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీకాంత్, తిరుపతి హన్మండ్లు, ఈర్ల రాజ్ గణేష్, అజిగిరి రాకేష్, నల్ల నవీన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు శైలు ఎంపిక



శైలును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నళిని

నవతెలంగాణ-డిచ్‌పల్లి
మండలంలోని సుద్దపల్లి లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని శైలు హ్యాండ్ బాల్ జాతీయ స్థాయికి ఎంపికైందని పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ నళిని మంగళవారం తెలిపారు. గత నెలలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జనవరి 4 నుండి 9 వరకు పూర్ణ బీహార్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న 53వ సీనియర్ మహిళల జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నట్లు తెలిపారు. ఎంపికైన సందర్భంగా నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగా మోహన్ చక్రు, పింజ సుందర్, పేట సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, రెడ్డి పేట సంఘం ప్రధాన కార్యదర్శిగా మల్లేష్ గౌడ్, ట్రెజరర్ రాజేష్, వైస్ ప్రిన్సిపల్ స్వప్న, వనిత, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జోష్న, పిఈటి శ్రీలత సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ మౌనిక విద్యార్థిని శైలును అభినందించారు.

రోడ్లకు నిధులు మంజూరు చేయండి

- మంత్రిని కలిసిన నియోజకవర్గ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
తెలంగాణ రాష్ట్ర పంచాయత్ రాజ్, గ్రామీణ అభివృద్ధి మరియు స్త్రీ-శిశు శంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి మంగళవారం కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు కొత్త రోడ్లను, బీటి రెన్యువల్‌కి నిధులు కావాలని కోరారు. మండలం నుండి మంథని నుండి రాంపూర్ వరకు 4.7 కిలోమీటర్ల రోడ్డును 4.40 లక్షల (నాలుగు కోట్ల నలభై లక్షలు), మాక్లూర్ మండలానికి సంబంధించిన రోడ్డు మెట్టు గొట్టి ముకుల మీదుగా ఆంధ్రనగర్, లక్మాపూర్, ఇంద్రానగర్ వరకు 3.85 కిలోమీటర్ రోడ్డును 203 లక్షల (రెండు కోట్ల మూడు లక్షల)తో, నందిపేట్ మండలానికి సంబంధించిన రోడ్డు నందిపేట్ రోడ్డు నుండి ఎల్లమ్మ దేవాలయం వరకు 2 కిలోమీటర్లకు 200 లక్షలు(రెండు కోట్ల) రూపాయలు సాంక్షన్ చేయాలని కోరారు. నియోజకవర్గానికి సంబంధించిన ఆయా గ్రామాలకు సంబంధించిన 21బిటి రోడ్లను 1987 లక్షల(సుమారు పందొమ్మిది కోట్ల ఎనభై ఏడూ లక్షల)తో రెనివల్స్ చేయాలని మంత్రిని కోరారు. నిధులను మంజూరు చేసినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

గొర్రెపాటి మాధవరావు సేవలు అమోఘం

- నివాళులర్పించిన యూనివర్సిటీ విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ప్రముఖ న్యాయవాది మాజీ పిడిఎస్‌యూ నాయకుడు గొర్రె పాటి మాధవరావు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ లోని ఓల్డ్ బాయ్స్ హాస్టల్లో పిడిఎస్ యూ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పి.డి.ఎస్.యూ నాయకుడు అక్షయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తీసుకొస్తున్న నూతన చట్టాలపై అవగాహన కోసం యూనివర్సిటీ విద్యార్థులకు సెమినార్స్ నిర్వహించారని చెప్పారు. పిడిఎస్‌యూ కార్యకర్తలకు ప్రతి సమస్యను లోతుగా ప్రోగ్రెసివ్ ఐడియాలాజీ తో చూసి పోరాటం చేయాలని నేర్పించారని, మాధవరావు మృతి పి డి ఎస్ యూ విద్యార్థి సంఘానికి తీరని లోటన్నారు.ఆయన స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్,నేష్, నితిన్, బిమేశ్, తిరుపతి, ఆకాశ్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప స్వాముల ఆరట్టు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని అయ్యప్ప స్వాములు మంగళవారం అయ్యప్ప దేవాలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఆరట్టు (ఊరేగింపు) నిర్వహించారు. ప్రతీ సంవత్సరం ఆరట్టు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని స్వాములు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



స్వామి విగ్రహాన్ని ఊరేగింపు చేస్తున్న స్వాములు

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో వెంకటేష్ యాదవ్, సూపరింటెండెంట్ హెచ్.శ్రీనివాసులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్తెపు శంకర్, ఉపాధ్యాయులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆక్రమణకు గురైన
స్థలం స్వాధీనం

- స్థలం చుట్టూ రేకుల కంచె ఏర్పాటు
- స్థలాన్ని సందర్శించిన ఆర్డీవో
- రిజిస్ట్రేషన్ రద్దు కోసం సిఫార్సు
- ఫలించిన గ్రామస్తుల రాస్తారోకో



స్థలం చుట్టూ రేకుల కంచె ఏర్పాటు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామపంచాయతీ స్థలం ఆక్రమణకు గురవడంతో గ్రామస్తులు సోమవారం రాస్తారోకో చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ స్థలాన్ని మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, ఎమ్మార్వో నరేందర్, ఎంపీడీవో నరేష్ అధికారుల బృందం సందర్శించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో ప్రభాకర్ ఎమ్మార్వో నరేందర్‌కు సూచించడంతో సర్వేయర్ కిరణ్ సమక్షంలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. చుట్టూ హద్దులు పాతి కంచె ఏర్పాటు చేయాలని ఆర్డీవో ఆదేశించడంతో చుట్టూ రేకుల కంచెను ఏర్పాటు చేశారు. స్థలాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

న్యాయమైన డిమాండ్లను
ప్రభుత్వం పరిష్కరించాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు ట్రస్మా మద్దతు
- ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

నవతెలంగాణ-కామారెడ్డి

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉప్పునూ తల నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 22 రోజులుగా ఇంటిని, పిల్లలను వదిలి జిల్లా కేంద్రంలో తమ సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు శరత్‌చంద్ర, జిల్లా కోశాధికారి నిస్సి సాంసంన్, రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, ఆనందరావు, జిల్లా నాయకులు శ్రీనివాస్ రాజారాం, రాజు, చంద్రశేఖర్, భాస్కర్, రమేష్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు శ్రీధర్ రాములు, శైలజ, సంతోష్‌రెడ్డి, కాళిదాసు, వనజ, మంగా, శ్రీవాణి, కళ్యాణ్, సంధ్య, లింగం, కృష్ణ, దినేష్, వీణ, లావణ్య 500 మంది సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

సమగ్ర శిక్ష ఉద్యోగస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విట్టల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెకు మద్దతు తెలుపుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగస్తులు గత కొన్ని రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రావణ్, అజయ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా కుమ్మరి యాదగిరి



జిల్లా అధ్యక్షున్ని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-పిట్లం

బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కుమ్మరి యాదగిరి ఎన్నికైనట్లు రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బిసి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కుమ్మరి యాదగిరి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు అందరికీ అందుబాటులో ఉండి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని వివరించారు. పదవి కట్టబెట్టినందుకు రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్, ఇతరాత్ర రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయనకు రాష్ట్ర జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు చింతల శంకర్, రాజయ్య, శ్రావణ్ కుమార్‌గౌడ్, రాజేందర్, సదాశివనగర్, మండల ఇన్చార్జి రాజు, జిల్లా పట్టణ నాయకులు అల్వాల్ గోపాల్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట్)

రాజంపేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో రఘురాం మంగళవారం పిఆర్‌టియు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ పూర్ణచందర్, పిఆర్టియు మండల అధ్యక్షులు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, దుర్గయ్య, సాయిరెడ్డి, ఉపాధ్యాయులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌టియు క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ పిఆర్‌టియు క్యాలెండర్‌ను తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్‌యాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు, పీఆర్టీయూ మండలాధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగం గౌడ్, వై.కిషోర్ కుమార్, గౌరవ అధ్యక్షులు ఈ.శంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరసింహారెడ్డి, కృష్ణ, నాందేవ్, శంకర్, మండల అసోసియేట్ అధ్యక్షులు రఫిక్ హుంల్ అజీమ్ తాహిర్, మండల కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రాథమిక సభ్యులు వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పి పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-రెంజల్

అఖిలభారత ఐక్య రైతు సంఘంను చట్టబద్ధత కల్పించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రోజుకు 600 రూపాయలు, 200 రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని బోర్గం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సన్న చిన్న కారు రైతులకు ఇలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయం అమలు చేయాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు ఐక్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, ఉపాధ్యక్షులు పుట్టి నడిపి నాగన్న, మండల అధ్యక్షులు పెద్దులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పార్వతి రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కె నసీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వడ్డెన్న, సిద్ధప్ప, సిద్ధ పోశెట్టి, జబ్బర్, సుదర్శన్ గౌడ్, మైసయ్య, తరుణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్ (రాజంపేట్)

రాజంపేట్ మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన నర్సింలు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రాజంపేట్ మండల యువజన అధ్యక్షులు అంకం కృష్ణారావు బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.2వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దిలీప్, యాదగిరి, సతీష్, సిద్ధ రాములు, రాములు, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి

- ఎంపీడీవో వెంకటేశ్ యాదవ్



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో వెంకటేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని నీలా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు 50 శాతం సర్వే పూర్తి కానందున, బృందాలుగా ఏర్పడి సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా ఆన్లైన్లో నమోదు చేయాలని వారు సూచించారు. అర్హులైన నిరుపేదలను తప్పకుండా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి పాఠశాల సందర్శన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి పాఠశాలను మంగళవారం తహసిల్దార్ శ్రావణ్ కుమార్ సందర్శించారు. మహారాష్ట్ర సరిహద్దులోనున్న కందకుర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాబోధనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణను ఇవ్వాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ కరీంకు సూచించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించి విద్య బోధనలో మార్పులు తీసుకురావాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు. మూడు విడతలుగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వగా మొదటి పూర్తయిందని, రెండవ విడతలో నిర్వహించే పరీక్షల సమయంలో తనకు సమాచారం ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని బయటకు తీసేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్

ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉద్యోగ విరమణ



ప్రధానోపాధ్యాయురాలిని సన్మానించిన ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-బోధన్ టౌన్

పట్టణంలోని భసవతారక్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఆర్.ఎస్ జ్యోతి ఉద్యోగ విరమణ చెందారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. పాఠశాలలోని తన జ్ఞాపకాలను పంచుకుంటూ, విద్యార్థులు మంచిగా చదువుకుంటే సమాజంలో గుర్తింపు వస్తుందని, బాగా చదువుకొని విద్యావంతులుగా ఉండాలని, రేపటి తరానికి ఆదర్శప్రాయులుగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వరూపారాణి, షబ్బీర్, రాజు, అత్తరుద్దీన్, అజీముద్దీన్, రజని కుమారి, వాహేద్, గౌసుద్దీన్, గంగావేణి, కల్పన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టం బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-భిక్కనూర్

సమాచార హక్కు చట్టం 2005 సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని పట్టణ కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో ఏఈ సంకీర్త్ కు సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో సమాచార హక్కు చట్టం అమలైందని నేటి వరకు సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం గమనించి బోర్డు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధి రాజు, తదితరులు ఉన్నారు.



హాకీ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన ఎంఈవో



హాకీ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన ఎంఈవో

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్గుల్ పాఠశాలలో గర్గుల్ హాకీ ప్రీమియర్ లీగ్ (జిహెచ్‌పిఎల్)ను మండల విద్యాశాఖ అధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్‌రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన బూతు కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని బూతు నెంబర్ 104, 105లో నూతన బూతు కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. 104 బూత్ అధ్యక్షులుగా రాజేందర్‌ను, 105వ బూత్ అధ్యక్షులుగా కిషన్‌రావు నియమితులైన సందర్భంగా వారికి మండలాధ్యక్షులు కుంట రాంరెడ్డి, మండల ఉపాధ్యక్షులు బాల్ కిషన్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిజెపి పూర్వ నాయకులు, కార్యకర్తలు, శక్తి కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన అంకాశేశ్వర్‌రెడ్డి కూతురు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ మంగళవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పాప మృతి పట్ల సంతాపం తెలియచేశారు. అదేగ్రామానికి చెందిన మోహన్‌గౌడ్ తండ్రి చందర్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందడంతో చందర్‌గౌడ్ పార్థివ దేహానికి నివాళు లర్పించారు. ఆయన వెంట ఎల్లారెడ్డి యూత్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌తేజ, అన్నసాగర్ గ్రామ యూత్ అధ్యక్షుడు నసిర్, మాజీ ఎంపిటిసి గురుప్రతాప్, సీనియర్ నాయకులు రామాగౌడ్, సాయగౌడ్, మొగులగౌడ్, ప్రమోద్ గౌడ్, హైమద్ పాషా, అశోక్ రెడ్డి, కాశిరం, బాలయ్య, తదితరులు ఉన్నారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్ టౌన్

పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను సంఘం సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి పట్టణ కమిటీ అధ్యక్షుడు గుర్రం సంతోష్, మాజీ అధ్యక్షుడు దేవిదాస్, కౌన్సిలర్ బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసినీ వినోద్ (చిన్న), జిల్లా కార్యవర్గ సభ్యులు లోల శంకర్, సురేష్, కార్యవర్గ సభ్యులు, పద్మశాలి కులపెద్దలు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-ఎడపల్లి

గత మూడు రోజుల క్రితం మండలంలోని జానకంపేట్ గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో కాలిపోయి సర్వం కోల్పోయిన న్యాకపు లక్ష్మి కుటుంబానికి శ్రీ సరస్వతి విద్యానికేతన్ ప్రధానోపాధ్యాయురాలు సంతోషి కుమారి, ఉపాధ్యాయ బృందం మంగళవారం పరామర్శించారు. వారికి నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుమలత, లిపికా, లావణ్య, శైలజ, విజయ, కళ్యాణి, మనీషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియం విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చి మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో స్పందన, సరూర్‌నగర్ హైదరాబాదులో నిర్వహించిన పోటీల్లో సాయిచరణ్ విజేతలుగా నిలవడంతో ఇరువురిని మండల విద్యాశాఖ అధికారి సాయిలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకర్ మంగళవారం అభినందించారు.

సర్వే వేగవంతంగా చేపట్టాలి

- ప్రత్యేక అధికారి రాజారామ్

నవతెలంగాణ-తాడ్వాయి

ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతంగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. కుటుంబ యజమాని పూర్తి వివరాలు సేకరించి యాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. లబ్దిదారులు నివాసగృహం నిర్మించుకునేందుకు ప్లాట్ల కాగితాలు పంచాయతీలో గతంలో చెల్లించిన రసీదులు ఉన్నట్లయితే సేకరించి నమోదు చేయాలని పర్కొన్నారు. చిన్నపాటి తేడా లేకుండా సర్వే వేగంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్వేతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కరోబార్ స్వామి, తదితరులున్నారు.

మత్తడి పోచమ్మ ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న గౌడసంఘం సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి లింగంపేట్ గౌడ సంఘం సభ్యులు రేణుక ఎల్లమ్మ ఆలయంలో 2 లక్షల 1 వెయ్యి రూపాయలు విరాళాన్ని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు, సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పోతాగోని శంకర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు మనోహర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బుర్ర నారాగౌడ్, రాజారం, బాలయ్య, నారాగౌడ్, మారుతిగౌడ్, రవి, ఆకుల సంగయ్య, పెద్ద శివయ్య, భైరయ్య, సంజీవులు, బాలయ్య రాజు, నగేష్, నారాయణ, ప్రసాద్‌గౌడ్, నర్సాగౌడ్ తదితరులున్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-దోమకొండ

సమాజంలో కుల మతం బేధం లేకుండా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవంపై గ్రామస్తులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పౌర హక్కుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎస్సి, ఎస్టీలను కులం పేరు ఎవరైనా దూషిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రేఖ, వార్డెన్ సరిత, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కును అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో మంగళవారం గ్రామానికి చెందిన రాజిరెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. బాధితుడు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా అతనికి మంజూరైన చెక్కును టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి బాధితుడికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్క నిరుపేద కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, వి.డి.సి. అధ్యక్షులు సూర్యకాంత్‌రెడ్డి, తక్కళ్ల బాపురెడ్డి, వీడిసి ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, గంగారెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ బోర్డుల అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్



మండల పరిధిలోని మంతిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4 గ్రీన్ బోర్డ్‌ల వితరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రోటరీ అధ్యక్షులు రజనీష్ కిరాడ్ మాట్లాడుతూ.. పిల్లలు ఇప్పటి నుండే ఇతరులకు సహాయం చేసే అలవాటు పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో ఆపదలో ఉన్నవారికి తమ వంతు సహాయం అందించాలని సూచించారు. శానిటరీ రాజేంధర్ రెడ్డి తండ్రి కాట్ పల్లి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం పీడీజి హనుమంత్ రెడ్డి గ్రీన్ బోర్డులను రోటరీ ఆధ్వర్యంలో మంథని స్కూలుకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయబృందం, సెక్రెటరీ రాస ఆనంద్, కాంతి గంగారెడ్డి, తులసి కుమార్ పట్వారి, బొడ్డు వినాయక్, వి.లక్ష్మినారాయణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని చింతలూరు గ్రామంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. గ్రామ అధ్యక్షుడు పుప్పాల గంగాధర్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అరిగెల అభిలాష్ సొసైటీ, చైర్మన్ నాగుల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ బ్రమన్ పల్లి జెలందర్, పుప్పాల హన్మాండ్లు, నాగుల లింబాద్రి, గడ్డం శ్రీనివాస్, గోపిడి చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని నాల్గవ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలు అదృశ్యమైనట్లు నాల్గవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఎస్ఎస్ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంక్ కాలనీకి చెందిన ముత్యం ఉమారాణి (62) డిసెంబర్ 29న మహా లక్ష్మి టెంపుల్ కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కుమారుడు ముత్యం జ్ఞానేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వృద్ధురాలు ఎవరికైనా కనిపించిన నాల్గవ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712659840, నగర సిఐ నెంబర్ 8712659836 కు సమాచారం అందించాలన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి వరం

- డిసిసి డెలిగేట్ సుధాకర్



చెక్కులు అందజేస్తున్న తలారి సుధాకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని డిసిసి డెలిగేట్ తలారి సుధాకర్ అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండలంలోని యెల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఉన్నప్పుడు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది సహాయం కోసం దరఖాస్తులు చేసుకున్న వారందరికీ కొండంత అండగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎన్నో కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్షలాది రూపాయలు మంజూరు చేయిస్తూ బాధిత కుటుంబాలను ఆదుకుంటున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ఇలాంటి సహాయం ఏ రాష్ట్రంలోనూ లేదని అన్నారు. 8 మంది లబ్ధిదారులకు 2లక్షల 98వేల చెక్కులను డిసిసి డెలిగేట్ తలారి సుధాకర్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు షారూక్,సీనియర్ నాయకుడు కె మోహన్,ఆశిష్,కె సతీష్ రాజన్న,రాజేశ్వర్,మోహన్,అనిల్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు, డ్రైనేజీల కోసం నిధుల మంజూరు పట్ల ఎమ్మెల్యే హర్షం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజల, తన కోరిక మేరకు సిసి రోడ్లు, డ్రైనేజ్ ల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5 కోట్ల 20 లక్షలు చేయడం పట్ల మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల మహార్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల దీక్షా శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు 24 వ రోజు సమ్మె కొనసాగింది. ఈసందర్భంగా మంగళవారం వినాయక్ నగర్ లోని తెలంగాణ అమరవీరుల పార్కు వద్ద అమరవీరుల స్థూపంవద్ద నివాళులర్పించారు. అక్కడి నుండి ఎన్టీఆర్ చౌరస్తాలోని ధర్నా చౌక్ వద్దకు మహా ర్యాలీ నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భూపేందర్ మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల త్యాగాలపై ఏర్పడ్డ రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులతో జరిగిన చర్చల్లో ఆర్థికపరమైన అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, రాజు, జాన్, సత్యపాల్, రవికిరణ్, పుష్ప, రాణి, వినోద, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌ని సందర్శించిన ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా శాఖ రెడ్‌క్రాస్ కార్యాలయం, రక్త నిధి, తలసేమియా కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర రెడ్‌క్రాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.శ్రీరాములు మంగళవారం సందర్శించి పని తీరును తెలుసుకున్నారు. జిల్లా శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులుకి కార్యవర్గానికి అభినందలు తెలుపుతూ కొన్ని సూచనలు తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, కార్యదర్శి గోక అరుణ్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, నిజామాబాదు డివిజన్ చైర్మన్ డా.శ్రీశైలం, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయ కర్త అబ్బాపూర్ రవీందర్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ రాజేశ్వర్, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణ, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- శిథిలావస్థలోని ఇండ్లవారు ముందుకొస్తే సర్వే యాప్‌లో వివరాలు నమోదుచేయాలి

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంతోపాటు కులాస్‌పూర్ తదితర గ్రామాల్లో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా.. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు, పాత పెంకుటింట్లో ఉంటున్నారా లేక పక్కా గృహం, నివేశన స్థలానికి సంబంధించి ఏమైనా ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా? తదితర అంశాలను పరిశీలిస్తూ మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయించారు. ఇప్పటివరకు ఎంత మంది దరఖాస్తుదారుల వివరాలను సర్వే యాప్‌లో అప్లోడ్ చేశారు, ఇంకా ఎన్ని మిగిలి ఉన్నాయని వివరాలు ఆరా తీశారు. దరఖాస్తుదారుల వృత్తికి సంబంధించి యాప్‌లో కొత్తగా చేర్చిన అప్షన్లు వస్తున్నాయా? సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు దృష్టికి వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే, అలాంటి వారి వివరాలను కూడా సర్వే యాప్‌లో పొందుపర్చాలని అన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా లబ్ది చేకూరేందుకు వీలుగా జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని, సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రామేశ్వర్, ఎంపీడీఓ రాముల నాయక్, ఎంపీఓ కిరణ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి హన్మాన్ రాజ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

వేల్పూర్ వాసి అరవింద్‌గౌడ్‌కు డాక్టరేట్

హర్షం వ్యక్తం చేసిన రామన్నపేట చరిత్ర గ్రంథ రచయిత కంకణాల రాజేశ్వర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన బొంబోతుల అరవింద్ గౌడ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించింది. అరవింద్ గౌడ్ వృత్తిరీత్యా జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో సైంటిస్ట్(శాస్త్రవేత్త)గా ఏడు సంవత్సరాలుగా భారత ప్రభుత్వానికి సేవలు అందిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బొంబోతుల అరవింద్ గౌడ్ 'పెట్రోలోజీ, జియో కెమిస్ట్రీ అండ్ అసోసియేటెడ్ మినరలైజేషన్ ఇన్ గ్రానిటాయిడ్స్ ఆఫ్ పీజీసీ ఇన్ అండ్ అరౌండ్ మాల్ ఏరియా ఆఫ్ ఇస్టన్ దర్వారు కటింగ్ సౌత్ ఇండియా' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ప్రకటించింది. అరవింద్ గౌడ్ పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.ప్రభాకర్, జియాలజీ విభాగానికి చెందిన శాఖాధిపతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇంచార్జ్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. అరవింద్ గౌడ్‌ను బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ప్రొఫెసర్ కే.శ్రీను, ప్రొఫెసర్ల బృందం, సహధ్యాయులు, తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుండి డాక్టరేట్ పొందిన అరవింద్ గౌడ్ మాట్లాడుతూ డాక్టరేట్ సాధించడం సైంటిస్ట్ గా రాణించడం ఇంతటి ఉన్నత స్థితిలో ఉండడానికి ప్రధాన కారణం అన్నయ్య రవీందర్ గౌడ్, కుటుంబ సభ్యుల సంపూర్ణ ప్రోత్సాహం సహాయ సహకారాలతోనే సాధ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో గల జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో సైంటిస్ట్(శాస్త్రవేత్త)గా సేవలందించడం గర్వంగా ఉందని అన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న అరవింద్‌గౌడ్

డాక్టరేట్ సాధించడం హర్షనీయం....

వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన బొంబోతుల అరవింద్ గౌడ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ సాధించడం హర్షించదగిన విషయమని ప్రముఖ కవి, అఖిల భారత రచయితల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రామన్నపేట చరిత్ర గ్రంథ రచయిత కంకణాల రాజేశ్వర్ పేర్కొన్నారు.

అఖిర ఆసుపత్రిలో బాలుడికి చికిత్స

- ఆదుకుంటే పునర్జన్మ' అనే వార్తకు స్పందించిన ప్రముఖులు

నవతెలంగాణ-ముప్కాల్

డిసెంబర్ 28న ప్రచురితమైన 'ఆదుకుంటే పునర్జన్మ' అనే శీర్షికకు జిల్లా నలుమూలల నుండి పలువురు ప్రముఖులు మండల కేంద్రానికి చెందిన దొర సంతోష్ గౌడ్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా దాతలు ముందుకు వచ్చి వారి కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరుణంలో ఆయన పరిస్థితి విషమంగా మారడంతో బాధిత కుటుంబ సభ్యులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డిని సంప్రదించారు. అనంతరం సునీల్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తూ హైదరాబాద్‌లోని నిమ్స్ కు తరలించే విషయంలో ప్రత్యేక చొరవ చూపారు. మరోవైపు ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి దంపతుల కుమారుడు బద్దం దీపక్ రెడ్డి కరీంనగర్ జిల్లా కేంద్రంలో అఖిర ఆసుపత్రి సీఈవోగా ఉన్నారు. నవతెలంగాణ దినపత్రికలో వచ్చిన వార్తను చూసి స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులకు చరవాణిలో మాట్లాడి అఖిర ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందించడానికి ముందుకు వచ్చారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ అఖిర ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు బద్దం దీపక్ రెడ్డికి, ఫోన్ పే ద్వారా ఆదుకుంటున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆల్‌ఫోర్స్ లిటిల్ నేషనల్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని విద్యానగర్ కాలని ఆల్ ఫోర్స్ లిటిల్ నేషనల్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా మంగళవారం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, తండ్రి మల్లారెడ్డి విచ్చేసి పాఠశాలల వారీగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రమశిక్షణ ఆధ్యాత్మిక విషయాలను తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

నవతెలగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రవల్లిక 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మోతి బిందు ఉన్నవారిని నిర్ధారించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, బాల్కొండ చైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి, దినేష్ పటేల్, ప్రతాప్ రెడ్డి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియలో పండగల ఉత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామశివారు క్షత్రియ పాఠశాలలో సీబీఎస్సీ విద్యా ప్రణాళికలో భాగంగా భారతదేశం రాష్ట్రాలు వాటి పండుగలు ఉత్సవం అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్షత్రియ విద్యాసంస్థల డైరెక్టర్ అల్జాపూర్ వీరేంద్ర జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అల్జాపూర్ వీరేంద్ర మాట్లాడుతూ.. మన దేశంలో భిన్న మతాలు, భిన్న ఆచార వ్యవహారాలు ఉన్నప్పటికీ మనమందరం ఒక్కటే అనే భావన ఉందని అన్నారు.

అనాది నుండి భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తూ భారతీయులందరు ఐక్యమతంతో దేశ చరిత్రను, సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను కాపాడుకున్నారని, ప్రతి విద్యార్థి తన మాతృదేశ వైభవాన్ని, వివిధ రాష్ట్రాల చరిత్రను తెలుసుకోవటానికై ఇటువంటి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహస్వామి మాట్లాడుతూ సీబీఎస్సీ విద్యా ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులందరు దేశం గురించి, మన దేశంలోని ప్రతి రాష్ట్రానికి సంబంధించిన ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నృత్య భంగిమల ఆధారంగా చేసిన సంగీత, నృత్య ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయా రాష్ట్రాల ప్రజల వేషధారణ, ఆహారపు అలవాట్లననుసరించి తయారు చేసిన ఆహార పదార్థాలను విద్యార్థులు ప్రదర్శించినారు ఇట్టి ఫుడ్ ఫెస్టివల్ ను క్షత్రియ విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ ప్రారంభించినారు. ఒక్కో తరగతి విద్యార్థులు ఒక్కో రాష్ట్రానికి సంబంధించిన అంశములను ప్రదర్శించినారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న పాండే, పాఠశాల సిబ్బంది , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పిఆర్‌టియు 2025 క్యాలెండర్ ను మంగళవారం మండల విద్యాశాఖధికారి నరేందర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు ఆలూరు మండల అధ్యక్షులు సాయన్న, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కుంట శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ అష్రాఫ్ అహ్మద్, గాండ్ల రాంచందర్, బాబన్న, నరేందర్, సుధాకర్, రమేష్, వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, రాజు, సుమలత, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

ఘనంగా ముత్యాల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు



కమ్మర్‌పల్లి : నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు



మోర్తాడ్ : కేక్‌కట్‌చేస్తున్న నాయకులు



బాల్కొండలో...

- **పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/బాల్కొండ/ముప్కాల్/ఏర్గట్ల/మోర్తాడ్/ఆర్మూర్

మండల కేంద్రంతోపాటు హసకొత్తూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ల ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సునీల్ కుమార్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా సుంకేట రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి మండల కాంగ్రెస్ పార్టీ తరపున సునీల్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. హస కొత్తూర్ లో కిషన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, నూకల బుచ్చి మల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, సల్లూరి గణేష్ గౌడ్, వేముల చిన్న గంగారెడ్డి, సుంకేట శ్రీనివాస్, పాలెపు చిన్న గంగారం, నల్ల సాయికుమార్, పడాల గంగాధర్, హస కొత్తూర్‌లో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగేల ప్రవీణ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవతి గంగాధర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కుందేటి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండ:మండలం కేంద్రంలోని మహతి ఆశ్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, టౌన్ అధ్యక్షులు సంజీవ్ గౌడ్, టౌన్ ఇంచార్జ్ మోహన్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు జావిద్, మండల యూత్ అధ్యక్షులు అరవింద్, ఉపాధ్యక్షులు వివేక్, కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్:బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు మేడిపల్లి ముత్యం రెడ్డి, శ్రీకాంత్, బోజారెడ్డి, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు..

(వేల్పూర్)ఆర్మూర్: మండలంలోని పచ్చల నడుకుడ గ్రామంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు... అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిజామాబాద్ ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీను నాయక్ నేతృత్వంలో డెంటల్ క్యాంప్‌ను నిర్వహించారు.... పదవ తరగతి పిల్లలకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు స్వీట్స్ పండ్ల పంపిణీ చేశారు.

మోర్తాడ్ :బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు నోట్బుక్స్ పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాములు, మహిపాల్, అశోక్, అనిల్, చరణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్‌లు,పండ్ల పంపిణీ

ఏర్గట్ల: బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి పుట్టినరోజును మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్‌లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శివన్నోళ్ళ శివకుమార్, దేవరెడ్డి, ఆడేం గంగాప్రసాద్, గడ్డం జీవన్, జింక అనిల్ , బాలె శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, దిబ్బ సుదర్శన్, ఓర్సు రాములు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల సునీల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు
బడుగు, బలహీన పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకులు



ఆర్మూర్ :బడుగు, బలహీన, పేద ప్రజల సంక్షేమం కోసం సహాయ సహకారాలు అందిస్తున్న బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగు అనిల్ గౌడ్ మంగళవారం తెలిపారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ప్రత్యేక అధికారి రాజారాం

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను పర్యవేక్షించారు. వంట చేసేముందు చేతులు వంట పాత్రలు ఒకటి రెండుసార్లు కడిగి మాస్కులు ధరించి వంట చేయాలని సూచించారు. తాజా కూరగాయలతో రుచికరమైన వంటలు చేయాలన్నారు. అనంతరం పాఠశాల గదిలను పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారిని శ్వేతారెడ్డి తదితరులున్నారు.



వంటశాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రైతులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడాలి

● టెక్నికల్ డిఈ రమేష్

నవతెలంగాణ-బాల్కొండ

రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ ప్రమాదల బారిన పడకుండా చూడాలని విద్యుత్ శాఖ టెక్నికల్ డిఈ రమేష్ సూచించారు. మంగళవారం బాల్కొండ మండలం జలాల్ పూర్ గ్రామంలో పొలం బాట కార్యక్రమన్ని నిర్వహించారు. పొలాల మధ్య ఉన్న మోటార్లు, స్టార్టర్లు, పీవీసి పైపులు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యుత్ వస్తువు తప్పనిసరి ఎర్తింగ్ చెయ్యాలని సూచించారు. ఓల్టేజి సమస్య రాకుండా విద్యుత్ మోటార్లుకు కెపకసిటర్లు అమర్చుకోవాలని కోరారు. సమస్యలు ఉంటే సిబ్బందికి తెలిపాలని కోరారు. విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1912 పిర్యాదు చేసి సమస్యలు పరిష్కారించుకోవాలని కోరారు. బాల్కొండ ఏఈ కిషన్, సబ్ ఇంజనీర్ మహేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, లిఫ్ట్ చైర్మన్ గంగారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ గడచంద కల్పన అనిల్, ఉప సర్పంచ్ లింబారెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగారాం, వీడీసీ సభ్యులు, ఎంబరి ఆనంద్, గడచంద ప్రదీప్, మాజీ సర్పంచ్ గంగారాం, లైన్ మెన్ నవీన్, జెఎల్ఎం నరేందర్, గ్రామ రైతులు, పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం

● ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

● సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యుత్తు రంగాన్ని కాపాడుకుందాం.. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు నిరసనగా విద్యుత్ రంగ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మద్దతు తెలిపారు. అనంతరం నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంభిస్తుందని తెలిపారు. విద్యుత్ రంగంపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడి తార్కాణం అన్నారు. ఈ కాలంలోనే చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయన్నారు. దాదాపు అన్ని రాష్ట్రాలలో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా దొడ్డిదారిన ప్రైవేటీకరించే ప్రయత్నాలు ఊపందుకున్నాయని, పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్లను గంపగుత్తగా ఔట్‌సోర్స్ చెయ్యమని ఆదేశాలు జారీ అయ్యాయని, పునరుత్పత్తి ఇంధన సరఫరా కాంట్రాక్టులు చేజిక్కించుకుని, అధిక ధరలకు విద్యుత్ అమ్మజూపుతున్న అదానీ లంచాలు ఇచ్చి మరీ ఈ కాంట్రాక్టులు దక్కించుకున్నాడన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయన్నారు. అయినప్పటికీ స్మార్ట్ మీటర్ల అమలు సహా అన్ని కాంట్రాక్టులూ అదానీకే కట్టబెట్టారని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ రంగ కార్మికులు వీరోచితమైన పోరాటం చేస్తున్నారన్నారు.



నిరసనలో పాల్గొన్న నాయకులు

నేడు చండీగఢ్ విద్యుత్ కార్మికులు, ఉత్తర ప్రదేశ్ విద్యుత్ రంగ కార్మికులు ఈ పోరాటంలో అగ్రభాగాన ఉన్నారని తెలిపారు. 2003 విద్యుత్ చట్టానికి బలవంతంగా మార్పులు చెయ్యడానికి ప్రయత్నించి నపుడు కూడా చండీగఢ్ విద్యుత్ రంగ కార్మికులు సమరశీలంగా పోరాడారని, ఆ వారసత్వాన్నే నేటికీ కొనసాగిస్తున్నారని తెలిపారు. చండీగఢ్ విద్యుత్ రంగం 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా 365, 225, 261 కోట్ల రూపాయల లాభాలు సంపాదించిన ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. విద్యుత్ లైన్ సరఫరా నష్టాలు జాతీయ స్థాయిలో 15 శాతంపై మాటే కానీ చండీగఢ్ విద్యుత్ రంగం ఈ నష్టాన్ని 10 శాతం లోపుగా ఉండేలా సాధించిందని, అన్ని విధాలా అత్యుత్తమ సామర్థ్యం కలిగిన చండీగఢ్ విద్యుత్ సంస్థను కారు చౌకగా రూ.174.63 కోట్లకు వేలం పాట పెట్టారని తెలిపారు. సంస్థ భూములను, ఆస్తులను నెలకు ఒక్క రూపాయి అద్దెగా చెల్లించి వాడుకోవడానికి అనుమతి ఇస్తున్నారని, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) ద్వారా సంస్థ స్థిర, చరాస్తుల విలువను మదింపు చెయ్యాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ సంఘాలు సంయుక్తంగా డిమాండ్ చేస్తున్నాయన్నారు. టెండర్ ధరను నిర్ణయించడానికి ప్రాతిపదికగా తీసుకున్న ఆర్థిక సమాచారం మొత్తాన్ని మదింపు చెయ్యాలని కోరాయి. కానీ కేంద్రపాలిత ప్రాంత అధికార యంత్రాంగం ఈ డిమాండ్లను పరిశీలించ కుండా హడావుడిగా ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ (ఇఇడియల్) అనే ప్రైవేటు కంపెనీకి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు (లెటర్ ఆఫ్ ఇంటెంట్- ఎల్ఓఐ) జారీ చేసింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగం ప్రవేటీకరణను ఆపకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయక్ వాడి శ్రీనివాస్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్, దినేష్, ఆజాద్, పద్మ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వాయిదాపడ్డ శిక్షణా తరగతులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తలపెట్టిన శిక్షణ తరగతులు వాయిదా పడ్డాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద వెంకట రాములు తెలిపారు. మంగళవారం జరిగిన జిల్లా అత్యవసర జిల్లా కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. జనవరి 2025లో 4, 5, 6 తారీకులలో తలపెట్టిన రాజకీయ సామాజిక శిక్షణా తరగతులు వ్యవసాయ పనులు ఇంకా పూర్తికానందన అనివార్యంగా వాయిదా వేయాల్సి వస్తున్నదని ప్రకటించారు. తిరిగి 2025 జనవరి 20, 21, 22 తేదీలలో జరుగుతాయిన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొర్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గోళం లక్ష్మి, సహాయ కార్యదర్శి గోవర్ధన్, సభ్యులు చంద్రకాంత్, పిండి రాజేశ్వరి, లక్ష్మీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ బొర్రా గణపతి దేవాలయంలో మంగళవారం నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. పట్టణానికి చెందిన ఆనంద్ ప్రింటర్స్ వారి సౌజన్యంతో ఈ సంవత్సరం నూతన క్యాలెండర్ వీడిసి సభ్యులు అధ్యక్షులు దేవేందర్ క్యాషియర్ రాజబాబు సెక్రటరీ అశోక్, దేవేందర్ గార్ల సమక్షంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పది సంవత్సరముల నుంచి ఆనంద్ ఉచితంగా దాదాపుగా ఒక వెయ్యి క్యాలెండర్లను ప్రతి సంవత్సరం పంచడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌ను శాలువాతో సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు దేవేందర్, క్యాషియర్ రాజబాబు, సెక్రెటరీ అశోక్, పసుపుల రఘునాథ్, కుండుక గంగాధర్, దాస్, మట్ట వెంకటేష్, రఘుపతి, గంగా మోహన్, కిషన్, ఆలయ పూజారి ప్రభాకర్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శాంభవి హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-బాల్కొండ

శాంభవి హై స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. 2024 సంవత్సరంలో జరిగిన మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ బొట్ల రవిన్ ప్రసాద్, ప్రిన్సిపల్ ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్దిదారుల సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● సిపిఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్

● సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

ఇందిరమ్మ లబ్దిదారుల సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేయాలని సీపీఐ (ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. ఏరియా కమిటీ సమావేశం ఇడగొట్టి సాయిలు అధ్యక్షతన పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా పార్టీ రాష్ట్ర మహాసభల కరపత్రాల ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభల జయప్రదానికి అందరూ సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. విద్యార్థులు, కార్మికులు, రైతులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల వ్యవసాయ కూలీలకు 12 వేలతో పాటు పట్టణాల్లో ఉన్న కూలీల కూడా ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించి అర్హులైన లబ్దిదారులను అఖిలపక్ష కమిటీల ద్వారా ఎంపిక చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య డివిజన్ కమిటీ సభ్యులు భూమన్న, సుజాత, కొండ గంగాధర్, బుర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆకట్టుకున్న సాధనాశూరుల విన్యాసాలు

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో పోచమ్మ గల్లి మహాలక్ష్మి మందిరం వద్ద మంగళవారం సాధనా శూరుల విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పలు విన్యాసాల ద్వారా గ్రామస్తులను అలరించారు. వ్యక్తులను తాళ్ళతో బంధించి సునయసనంగా విడిపించుకోవడం , టెంట్లో రాళ్లతో దేవత విగ్రహాలు ఆవిష్కరించడం, చీపురు పుల్లలపై కళాకారుడు కూర్చోవడం , వంటి ఎన్నో కళాత్మక కనికట్టు విద్యలతో గ్రామస్తులను అబ్బుర పరిచారు. అనంతరం పలువురు గ్రామస్తులు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బుస శ్రీనివాస్ , గుండు నాగరాజ్ , అందే వెంకట గిరి, అంబిక శివలింగం, కుందారపు శ్రీనివాస్ , బుస రత్నాకర్, భరత్,కేదార్, శ్రీహరి, బొగ తిరుపతి, స%శీ%ఘ సభ్యులు బాల్కొండ ప్రజలు పాల్గొన్నారు.

విజయ్ హైస్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్లో మంగళవారం జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయ్ విద్యాసంస్థల అధినేత్రి డాక్టర్ అమృతలత విచ్చేసి ప్రారంభించారు.

విద్యార్థులు స్వశక్తితో ఏర్పాటు చేసిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన, వెజిటేబుల్ కార్వింగ్‌లో కాయగూరలు, పండ్లు, గుడ్లను ఉపయోగించి వివిధ రకాల కళారూపాలు కాకరకాయతో మొసలి, క్యారెట్ మరియు క్యాప్సికంతో తాటి చెట్లు, బీట్రూతో ఎలుక, బుడమకాయ , ద్రాక్షతో ముళ్ళపంది, పుచ్చకాయతో పూలబుట్ట, తాబేలు, అల్లికల విభాగంలో పూసలతో పర్సులు, చేతి గాజులు, కమ్మలు, ఇంటిలో సుందరీకరణకు ఉపయోగించే వివిద రకాల వస్తువులను తయారు చేశారు. వాటినన్నింటినీ ఆమె పరిశీలించి ప్రశ్నలకు జవాబులను రాబట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేయడం వల్ల పిల్లలలో దాగివున్న అంతర్గత శక్తులు బయటకి వస్తాయని, చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుకు తోడ్పాటు అందించిన ప్రధానోపాధ్యాయురాలిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవితాదివాకర్, ప్రైమరి క్లాస్ ఇంచార్జ్ ఎస్తర్ రాణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యాసంస్థల అధినేత్రి అమృతలత

సబ్సిడీపై గడ్డి విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● పశువైద్యాధికారి భిషేక్

నవతెలంగాణ-ధర్పల్లి

పశుగ్రాసం కోసం ప్రభుత్వం రైతులకు 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు పరిమిత స్థాయిలో 5 కిలోల బస్తాలు అందుబాటులో ఉన్నాయని మండల పశు వైద్యాధికారి బేల్దారి అభిషేక్ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు అందించే పశుగ్రాసం గడ్డి విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని అన్నారు. ఇప్పటికే పంపిణీ ప్రారంభించామని, పరిమిత స్థాయిలో ఉన్నాయని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగాలంటూ ఫోన్లు చేసే వారికి హెచ్చరిక

● డీఎంహెచ్‌వో రాజశ్రీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాలంటూ ఫోన్లు చేస్తూ రూ.25 వేలు ఇస్తే జాబ్ గ్యారంటీ అని అభ్యర్థులను, ప్రజలను మోసం చేస్తున్న అక్రమార్కులను హెచ్చరిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని రాజశ్రీ మంగళవారం తెలిపారు. స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకోసం మెంట్ జాబితా సిద్ధం చేసామని రూ1.40 లక్షలు ఇస్తే ఉద్యోగం గ్యారంటీ అంటూ అనర్హులకు కొందరు ఫోన్స్ చేస్తున్నారని తెలిపారు. అడ్వాన్సుగా 25 వేలు చేస్తే ఉద్యోగం ఇస్తానని లేకుంటే జాబులో పేరు ఉండదని సోమవారం పలువురు అభ్యర్థులకు ఫోన్లు వచ్చినట్టు పత్రికల ద్వారా తెలిసిందన్నారు. ఎటువంటి నియామకాలైన నియమ నిబంధనలు, మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఉన్న నియామక కమిటీ (డిఎస్‌సి) ద్వారా అర్హులైన వారిని నియమించడం జరుగుతుందన్నారు. కావున జిల్లా ప్రజలు ముఖ్యంగా దరాఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇటువంటి పుకార్లను నమ్మకుండా పోలీసులను ఆశ్రయించాలన్నారు. పత్రికల్లో వచ్చిన ఫోన్ నెంబర్ 9038108948 ఎవరి వద్ద నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయో ఆ నెంబర్ గురించి తెలుసుకోవడానికి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండి ఉద్యోగాలకోసం ఎవరూ మోసపోవద్దన్నారు. ఏమైనా సందేహాలుంటే వైద్య ఆరోగ్యా శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డిసెంబర్ 31 దావత్ కోసం

కోళ్లను చంపిన ఆకతాయిలు

● మక్కలు, వడ్ల గింజల్లో విషం కలపడంతో మృత్యువాత

● లబోదిబోమన్న కోళ్ళ యజమానులు

నవతెలంగాణ-ఏర్గట్ల

డిసెంబర్ 31 అంటే సంవత్సరానికి ముగింపు రోజు, మందు,విందుతో పార్టీల చేయడం పట్నం నుంచి పల్లెల దాకా ఇది వ్యాప్తి చెందింది. ఇక ఈ విషయం అటుంచితే ఏర్గట్ల మండలకేంద్రంలో డిసెంబర్ 31 న జరిగిన సంఘటన గ్రామం మొత్తం విస్తుపోయేలా చేసింది. దావత్ చేసుకోవడానికి గుర్తుతెలియని ఆకతాయిలు డబ్బులు ఖర్చు పెట్టుడు ఎందుకు అనుకున్నారో ఏమో గాని మండలకేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కోళ్ళు ఎక్కడ కనిపిస్తే అక్కడ విషం కలిపిన మక్కలు, వడ్ల గింజలను చల్లడంతో వాటిని తిన్న కోళ్ళు సుమారు 40 నుండి 50 వరకు అడ్డం పడి కొట్టుకుని ప్రాణాలు విడిచాయి. ఏం జరుగుతుందో తెలియని కోళ్ళ యజమానులు, గ్రామ ప్రజలు ఇది చూసి నిర్ఘాంతపోయారు. పెంచుకున్న కోళ్ళు అన్ని ఒక్కసారిగా ప్రాణాలు విడవడంతో దుండగులను పోలీసులు పట్టుకుని శిక్షించాలని, మరిసారి ఇలాంటి నష్టం జరగకూడదని కోళ్ళ యజమానులు కోరారు.



చనిపోయిన కోడిని కోసి చూడడంతో విషయం వెలుగులోకి..

కోళ్ళన్నీ ఎందుకు ఒక్కసారిగా ఇలా అడ్డం పడి చనిపోతున్నాయని ఆలోచించిన, వాటి యజమాని ఒకరు చనిపోయిన ఒక కోడిని కోయగా అందులోంచి మక్కలు, వడ్ల గింజలు బయటికి వచ్చాయి. కోళ్ళు తిని పడిపోయిన ప్రదేశాన్ని గమనిం చగా రోడ్డుపై విషంకలిపిన మక్కలు, వరి గింజల ఆనవాళ్ళు కనిపించాయి. ఈ విషయం ఈ నోటా ఆ నోటా పడడంతో వెలుగులోకి వచ్చింది.అయితే ఒక బాలిక మాట్లాడుతూ ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి మక్కలు, వరి గింజలు చల్లడం చూశానని, వారు గుర్తుపట్టలేకుం డా ముఖానికి గుడ్డ కట్టుకున్నట్లు కోళ్ళ యాజమానికి, అక్కడ ఉన్న ప్రజలకు తెలిపింది.

రైతాంగ వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నాయి

● జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నాయని దీనికి ఐక్య ఉద్యమాలు నిర్మించడానికి రాష్ట్రంలో మన జిల్లా ముందు వరుసలో ఉండే విధంగా సభ్యులంతా పనిచేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్లో కామ్రేడ్ సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. కామ్రేడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్ ఎజెండా అంశాలు ప్రతిపాదిస్తూ.. సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నాయని దీనికి ఐక్య ఉద్యమాలు నిర్మించడానికి రాష్ట్రంలో మన జిల్లా ముందు వరుసలో ఉండే విధంగా సభ్యులంతా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరుస్తానని తెలిపారు. మోడీ ఇచ్చిన హామీలు అమలు కోసం శంభు సరిహద్దులో నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ రైతు నాయకుడికి బాసటగా నిలబడదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశం తర్వాత ప్రతినిధి బృందం కలెక్టర్ ద్వారా భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకి విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ.. ఢిల్లీ కేంద్రంగా 13 మాసాలు ఉద్యమం, ఉద్యమం తలవగ్గి భారత రైతాంగానికి క్షమాపణ చెప్పి.. రాతపూర్వక హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. మోడీ నిండు పార్లమెంట్లో రాతపూర్వక హామీలను అమలు చేయాలని ఉద్యమంలో అమరత్వం పొందిన 750 కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటానని హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి, మోడీ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26 నుంచి శంభు సరిహద్దున ప్రముఖ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాలా అమరణ నిరాహార దీక్ష చేస్తున్నారన్నారు. తన ఆరోగ్యం క్షీణించి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని, కనుక భారత రాష్ట్రపతి వెంటనే జోక్యం చేసుకొని రైతు నాయకులు, సంఘాలతో చర్చలు జరిపి రాతపూర్వక హామీలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి అమరణ నిరాహార దీక్షను ఉపసహరించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతు నాయకుడు మృతి చెందితే మోడీ బాధ్యత వహించాల్సి వస్తుందని, రైతాంగమంతా తిరగబడతారని హెచ్చరిస్తున్నామన్నారు. చర్చలు ఏకైక మార్గమని గుర్తు చేస్తూ రాష్ట్రపతి దేశ ప్రధానిపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సారా సురేష్, ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్, రాష్ట్రనాయకులు పుట్టి నాగన్న, జిల్లా నాయకులు, బాజన్న గారి బాబన్న, యు రాజన్న, తదితరులు పాల్గొన్నారు.